ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 21 జూలై 2024



పింఛన్ల పందేరం..!

వైకల్యం లేకున్నా సదరం సర్టిఫికెట్
చెవుడు, మూగవారిగా చూపించారు..
భర్తతో ఉంటూ.. ఒంటరి మహిళగా..
వైసీపీ హయాంలో భారీగా అక్రమాలు
వలంటీర్ల ఇళ్లలో ఇద్దరు ముగ్గురికి పింఛన్

కూడేరు/శింగనమల, జూలై 20: వృద్ధులు, దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంతులు, ఒంటరి మహిళలు, వితంతువులు, అంతరించిపోతున్న వృత్తులవారి జీవనానికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వాలు సామాజిక భద్రత పింఛన్లను అందిస్తున్నాయి. నెల నెలా వచ్చే సొమ్ము ఆ వర్గాలవారు ఆత్మగౌరవంతో జీవించేందుకు కొంత ఆసరా అవుతున్నాయి. కానీ వైసీపీ హయాంలో వీటినికూడా పక్కదారి పట్టించారు. పింఛన్ల మంజూరు, పంపిణీలో కీలకంగా వ్యవహరించిన వలంటీర్లు కొందరు ప్రభుత్వం అందించే పింఛన్లను అనర్హులకు దక్కేలా చేశారు. తమ కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ముడుపులు ఇచ్చినవారికి పింఛన్లను దొడ్డిదారిలో మంజూరు చేయించారు. ప్రభుత్వం మారడంతో ఈ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

దొడ్డిదారిలో పింఛన్లు


కూడేరు మండలంలో 5,700 మందికి పింఛన్లు వస్తున్నాయి. వైసీపీ అధికారంలోకి రాగానే టీడీపీ సానుభూతిపరుల పింఛన్లను పెద్ద ఎత్తున్న తొలగించారు. కొందరు అధికారులు వైసీపీ కార్యకర్తల తరహాలో వ్యవహరించారు. అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారు. పది ఎకరాలు, అంతకన్నా ఎక్కువ భూమి ఉన్న రైతులకు గత ప్రభుత్వంలో పింఛన్లు నిలిపివేశారు. అలా పింఛన్లు కోల్పోయినవారికి కొందరు అధికారులు అడ్డదారుల్లో మళ్లీ పింఛన్లు మంజూరు చేశారు. వైకల్యం లేకపోయినా.. అక్రమంగా సదరం సర్టిఫికెట్లు పొందిన వారు, భర్త ఉన్నా ఒంటరి మహిళ అని చూపించినవారు, వయసు తక్కువగా ఉన్నా... వృద్ధాప్యంలో ఉన్నట్లు చూపించినవారు పింఛన్ల జాబితాలో వందల్లో ఉన్నారు. ఆధార్ కార్డుల్లో వయసును మార్చడం, వైద్యులకు ముడుపులు ఇచ్చి వైకల్యం ఉన్నట్లు సరిఫికెట్లు పొందడం ద్వారా అక్రమంగా పింఛన్లు అందుకుంటున్నారు.

అధికారం మారడంతో..

వైసీపీ పాలనలో వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పింఛన్లు అందజేశారు. దీంతో అక్రమాల గుట్టు బయట పడలేదు. టీడీపీ కూటమి అధికారం చేపట్టగానే సచివాలయ ఉద్యోగుల చేత పింఛన్లను పంపిణీ చేయిస్తున్నారు. వారి వెంట తెలుగు తమ్ముళ్లు వెళ్లి పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో అక్రమాలు బయట పడుతున్నాయి. అనర్హులకు పింఛన్లు మంజూరు చేసిన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు టీడీపీ నాయకులు సిద్ధమవుతున్నారు. చోళసముద్రం, ఉదిరిపికొండ తండా, జయపురం తదితర గ్రామాలలో అనర్హులను గుర్తించారు. వారి పింఛన్లను తొలగించాలని కోరుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

ఇదిగో.. అక్రమ పింఛన్లు

- ఉదిరిపికొండ తండాలో మోతి బాయి (ఐడీ నంబర్ 112967407), తిప్పేనాయక్ (ఐడీ నంబర్ 112868190) దంపతులు కలిసే ఉన్నారు. కానీ వేర్వేరుగా రేషన్‌కార్డులు పొంది.. ఇద్దరూ వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారు.
- ఇదే తండాలో మూడ్ దుర్గమ్మ (ఐడీ నంబర్ 11200116792), శంకర్‌నాయక్ (ఐడీ నంబర్ 112966584) దంపతులు, షేక్ హుస్సేన్ బీ (ఐడీ నంబర్ 112900558), షేక్ పెద్ద హుసేన్ సాబ్ (ఐడీ నంబర్ 112906091) దంపతులు వేర్వేరు రేషన్‌కార్డులతో పింఛన్లు పొందుతున్నారు.
- ఫాతిమా అనే మహిళ తన భర్తతో కాపురం చేస్తూనే.. ఒంటరి మహిళ కోటాలో (ఐడీ నంబర్ 112965146) పింఛన్ పొందుతున్నారు.
- చోళసముద్రంలో వైకల్యం లేకపోయినా పలువురు దివ్యాంగుల కోటా పింఛన్లు తీసుకుంటున్నారు. అడ్డదారిలో సదరం సర్టిఫికెట్లు తెచ్చుకుని.. అక్రమంగా పింఛన్ అందుకుంటున్నారు. సావిత్రి (ఐడీ నంబర్ 11200196922), నాగేంద్ర (ఐడీ నంబర్ 11200174864) ఇందుకు ఉదాహరణ. ఇదే గ్రామంలో చర్మకారుల కింద వన్నూరప్ప (11200182639), శ్రీనివాసులు (11200170997), ఎర్రిస్వామి (11200171002) తదితరులు అర్హత లేకున్నా పింఛన్లు పొందుతున్నారని ఉన్నతాధికారులకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు.
- జయపురంలో దాదాపు 16 మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నారని టీడీపీ నాయకులు గుర్తించారు. వీరి జాబితాతో ఉన్నాధికారులకు ఫిర్యాదు చేశారు. చోళసముద్రం గ్రామంలో అనర్హులకు అందిన పింఛన్లపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారని ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత తెలిపారు.



చిన్న జలాలపురం గ్రామంలో వైకల్యం లేకున్నా దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వారి ఐడీ నంబర్లు

మీరైనా తొలగించండి..

'మా ప్రభుత్వంలో అధికారులు, ప్రజాప్రతినిధుల అండతో చాలామంది అక్రమంగా పింఛన్లు తీసుకున్నారు. ప్రతి వలంటీర్ల ఇంట్లో, వైసీపీ నాయకుల ఇంట్లో అక్రమంగా పింఛన్లు పొందుతున్నవారు ఉన్నారు. వైకల్యం లేకపోయినా.. నకిలీ సదరం సర్టిఫికెట్లతో పింఛన్ తీసుకున్నాం..' అని శింగనమల మండలం చిన్న జలాలపురం గ్రామానికి చెందిన వైసీపీ రాష్ట్ర మహిళ విభాగం కార్యదర్శి బండి లలితమ్మ స్వయంగా పేర్కొన్నారు. తమ పంచాయతీలోని ఓ టీడీపీ నాయకుడితో ఆమె ఫోన్‌లో మాట్లాడిన సంభాషణలు.. వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలకు నిదర్శనం. 'చిన్న జలాలపురంలో 30 నుంచి 40 మంది చెవిటి, మూగ కింద అక్రమంగా పింఛన్లు పొందుతున్నారు. వారికి ఎలాంటి వైకల్యం లేదు. వలంటీరు ధనుంజయ నకిలీ సర్టిఫికెట్లతో తమ కుటుంబాల్లోని పది మందికి పింఛన్లు ఇప్పించారు. వెరిఫికేషన్ చేసి.. అలాంటివి తొలగించండి..' అని ఆమె టీడీపీ నాయకుడిని కోరడం గమనార్హం.

ఇంటింటా అక్రమార్కులు

చిన్న జలాలపురం వలంటీరు ధనుంజయ తల్లి ఆలివేలమ్మ (ఐడీ నంబర్ 11200156825), పెద్దమ్మ చౌడమ్మ (11200132644) జేన్నె ఆదినారాయణ (11290427002) అక్రమంగా పింఛన్లు పొందుతున్నారు. వలంటీరు సింధు తల్లి కళావతి (11200161131), ఎద్దుల ఆదిలక్ష్మి (11200140119) వెంకటలక్ష్మి (11200190030) నాగరత్నమ్మ (1120067006) బండి వెంకటరాముడు (11200084091) జెన్నే వెంకటలక్ష్మి (11200190900) పింఛన్లు అందుకుంటున్నారు. అంగ వైకల్యం, చెవుడు, మూగ పేరిట వీరు నకిలీ సదరం సర్టిఫికెట్లు సమర్పించారని సమాచారం. గుంతకల్లు, కదిరి, అనంతపురం ప్రాంతాలకు చెందిన వైద్యుల నుంచి వీరు దొడ్డిదారిలో సదరం సర్టిఫికెట్లు పొందినట్లు తెలిసింది.



ఫిర్యాదు చేయడానికి ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన తండావాసులు

అయ్యో.. ఎంత ఘోరం..!

బైకును ఢీకొన్న ఇసుక ట్రాక్టర్
బడికి వెళుతున్న అక్కాతమ్ముడి మృతి.. ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేస్తుండగా ప్రమాదం

అన్నదమ్ముల బిడ్డలు..! అక్క తమ్ముడు..! అన్యోన్యంగా ఉండేవారు. కలిసి బడికి వెళ్లేవారు. ఇంట్లో ఎవరో ఒకరు వారిద్దరినీ బైక్‌పై ఎక్కించుకుని బడిలో దించేవారు. సాయంత్రం తిరిగి ఇంటికి పిలుచుకొచ్చేవారు. సేద్యం చేసుకునే ఆ అన్నదమ్ములిద్దరూ.. తమ బిడ్డల భవిష్యత్తు బాగుండాలని.. ఊరికి దూరంగా.. పట్టణంలో ఉన్న ప్రైవేటు పాఠశాలకు పంపించేవారు. కానీ విధి మరోలా తలచింది. ఆ ఇద్దరు చిన్నారులను ఇసుక ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబళించింది. వారి ఇంట అంతులేని విషాదాన్ని నింపింది.





మృతి చెందిన వరుణ్‌తేజ్, స్పందన



వరుణ్‌తేజ్, స్పందన(ఫైల్)

గుమ్మఘట్ట, జూలై 20: మండల పరిధిలోని ఎస్.కొత్తపల్లి గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. తమ మామ సురేష్‌తో కలిసి బైక్‌మీద బడికి వెళుతుండగా ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో వరుణ్ తేజ్(8), స్పందన(11) ప్రాణాలు కోల్పోయారు. దీంతో బాధిత కుటుంబం, గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఎస్.కొత్తపల్లికి చెందిన కురుబ మల్లికార్జున, మల్లేష్ సోదరులు వ్యవసాయం చేసుకుంటూ తమ బిడ్డలను చదివిస్తున్నారు. రాయదుర్గం పట్టణంలోని నారాయణ పాఠశాలలో మల్లికార్జున కుమారుడు వరుణ్‌తేజ్ మూడో తరగతి, మల్లేష్ కూతురు స్పందన ఐదో తరగతి చదువుతున్నారు. వీరిద్దరనీ కుటుంబసభ్యులు రోజూ బైక్ మీద బడికి తీసుకువెళ్లేవారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఇద్దరు చిన్నారులను మామ సురేష్ తన బైక్‌పై ఎక్కించుకుని బయలుదేరాడు. గ్రామ సమీపంలో భూపసముద్రం హగరి నుంచి ఇసుక ట్రాక్టర్ రాయదుర్గం వైపు వెళుతుండగా.. ఓవర్ టేక్ చేయబోయాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ ట్రాలీ తగలడంతో బైకు అదుపుతప్పి కింద పడింది. వరుణ్‌తేజ్ అక్కడికక్కడే మృతిచెందగా, స్పందన తీవ్రంగా గాయపడింది. వైద్యం కోసం అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. సురేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గుమ్మఘట్ట ఎస్ఐ వెంకటేశ్వర్లు ప్రమాద స్థలానికి చేరుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం తీసుకున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తాడిపత్రికి పెద్దారెడ్డి

అక్కడి నుంచి మళ్లీ అనంతకు..

2అనంతపురం క్రైం/తాడిపత్రి, జూలై 20: మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దాదాపు రెండునెలల తర్వాత తాడిపత్రికి వెళ్లారు. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో శనివారం జామీను పత్రాలను సమర్పించారు. ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్లు, రాళ్లదాడుల నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు ఆయన అనంతపురంలో ఉంటున్నారు. ఈ నెల 15న ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు అయింది. దీంతో జామీను పత్రాలను పోలీసులకు అందించారు. రెండు రోజుల క్రితం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన ఘాటు వ్యాఖ్యల నేపథ్యంలో పెద్దారెడ్డి తాడిపత్రికి రావడం ఉత్కంఠ రేపింది. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందేమోనని పోలీసులు, ప్రజలు ఆందోళన చెందారు. జామీను ప్రక్రియ ముగిశాక సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పెద్దారెడ్డిని అనంతపురంలోని ఆయన నివాసానికి తరలించారు. అనంతరం ఎస్పీ కేవీ మురళీకృష్ణను పెద్దారెడ్డి కలిశారు. ఎస్పీ చాంబర్‌లో దాదాపు 40 నిమిషాలపాటు పెద్దారెడ్డి గడిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గతంలో తాను ఫ్యాక్షన్ చేస్తానని అనలేదని, ప్రక్షాళన చేస్తానని చెప్పానని, కావాలంటే అప్పటి రికార్డులు చూడాలని అన్నారు. తన మాటలను మీడియా వక్రీకరించిందని ఆరోపించారు. తనను జిల్లా నుంచి బహిష్కరించడానికి మున్సిపల్ చైర్మన్‌కు ఏం హక్కు ఉందని ప్రశ్నించారు. ఎస్పీకి తాను ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, తన సమస్యలను, జిల్లాలో పరిస్థితులను వివరించానని అన్నారు. న్యాయం చేస్తానని ఎస్పీ అన్నారని తెలిపారు. తాను ఒక్కడినే ఉండటంతో.. తనను జేసీ ప్రభాకర్‌రెడ్డి ఏమైనా చేస్తాడనే ఉద్దేశంతో పోలీసులు భద్రత కల్పించి అనంతపురంలో వదిలి పెట్టి వెళ్లారని అన్నారు. ప్రజాస్వామ్యంలో అందరూ బాగుండాలని కోరుకుంటున్నానని అన్నారు. తాను తాడిపత్రికి ష్యూరిటీలు ఇవ్వడానికి వెళ్లానని, హైకోర్టు ఉత్తర్వుల్లో ష్యూరిటీలు ఇచ్చిన అనంతరం 15 రోజులు తాడిపత్రికి వెళ్ళకూడదని ఉందని తెలిపారు.



ఎస్పీని కలిసి బయటకు వస్తున్న పెద్దారెడ్డి

జగన్‌కు పులివెందులలో ఓటమి తప్పదు

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, జూలై 20: జగన్ తీరు మారకపోతే వచ్చే ఎన్నికల్లో పులివెందులలో కూడా ఓటమి తప్పదని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ పాలనలో మేధావులు, టీడీపీ కార్యకర్తలపై దౌర్జన్యాలు, ఊచకోతలు, శాంతిభద్రతల గురించి ఒక్కసారైనా ముఖ్యమంత్రి హోదాలో జగన్ మాట్లాడారా అని ప్రశ్నించారు. దళిత మేధావి డాక్టర్ సుధాకర్‌ను జగన్ ప్రభుత్వం బలి తీసుకుందని, చంద్రయ్య దారుణహత్య, గంధం సుబ్బయ్య హత్య.. ఇలా బీసీలను అతి కిరాతకంగా వైసీపీ గూండాలు హత్య చేస్తే సీఎం హోదాలో కనీసం స్పందించలేదని మండిపడ్డారు. ఇప్పుడు రషీద్ హత్యను రాజకీయ ప్రయోజనాల కోసం జగన్ వాడుకోవాలని చూస్తున్నాడని ఆరోపించారు. రషీద్ హత్యతో టీడీపీకి సంబంధం లేదని అన్నారు. దీనికి రాజకీయ రంగు పులమడం దిగజారుడుకు పరాకాష్ట అని అన్నారు. నెలన్నర క్రితం ఏర్పాటైన ప్రభుత్వాన్ని దించేసి రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేయడం ఏమిటని మండిపడ్డారు. 'నీ ఐదేళ్ల పరిపాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు తిరుగులేనిది. నీ దుర్మార్గాలు కళ్లార చూసిన ప్రజలు మళ్లీ మళ్లీ ఆదరించే ప్రసక్తే లేదు.' అని అన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్.. ఉన్న అవకాశాన్ని అసెంబ్లీలో ఉపయోగించుకోకుండా, ప్రజా సమస్యలు గురించి మాట్లాడకుండా, 24న ఢిల్లీకి వెళ్తానని, తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తీసుకెళతానని ప్రకటించడం ప్రజాస్వామ్యంపై అతనికున్న అపనమ్మకాన్ని బహిర్గతం చేస్తోందని అన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

సొంత జిల్లాలకు తహసీల్దార్లు

39 మందిని రిలీవ్ చేసిన కలెక్టర్

అనంతపురం టౌన్, జూలై 20: ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లిన తహసీల్దారు సొంత ప్రాంతాలకు వచ్చేస్తున్నారు. పొరుగు జిల్లాల నుంచి వచ్చిన తహసీల్దార్లు తమ ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అప్పట్లో జిల్లా నుంచి ఇద్దరు మినహా.. 39 మంది తహసీల్దార్లు కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు వెళ్లారు. ఆ జిల్లాల నుంచి 39 మంది ఇక్కడికి వచ్చారు. సీఎం చంద్రబాబు తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రెవెన్యూశాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలోని 39 మంది తహసీల్దార్లను రిలీవ్ చేస్తూ కలెక్టరు వినోద్‌కుమార్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో పొరుగు జిల్లాల నుంచి వచ్చినవారు ఒక్కొక్కరుగా రిలీవ్ అవుతున్నారు. వీరు సోమవారం తమ జిల్లాల కలెక్టరేట్‌లలో రిపోర్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి తహసీల్దార్లు వచ్చాక.. కలెక్టర్ వారికి పోస్టింగ్ ఇస్తారు.



చెరువుకట్ట వద్ద నగరోత్సవంలో సాయినాథుడు



రథాన్ని లాగుతున్న దృశ్యం



యువతి కోలాటం..

సాయినాథుడి నగరోత్సవం
పులకించిన అనంత జనం



వేణుగోపాల్‌నగర్‌లో కోలాటం



వేణుగోపాల్‌నగర్‌లో సాయినాథుడు



కళాకారుల విన్యాసాలు

సాయి నామస్మరణ, భక్తిగీతాలాపన, నగరోత్సవంతో అనంత వీధులు పులకించాయి. గురు పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని వేణుగోపాల్‌నగర్ సద్గురు సాయినాథ మందిరం ఆధ్వర్యంలో హంస వాహనంపై సాయినాథుని నగరోత్సవం నిర్వహించారు. విజయవాడ, నెల్లూరు, రాజమండ్రి ప్రాంతాల కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. చెరువుకట్ట షిర్డీసాయి ఆలయం ఆధ్వర్యంలోనూ సాయినాథుని నగరోత్సవం నిర్వహించారు. భక్తులు భజనలు చేస్తూ, కోలాటమాడుతూ ముందుకు సాగారు. వందలాది మంది భక్తులు వేడుకలలో పాల్గొన్నారు.

-అనంతపురం కల్చరల్



చెరువుకట్ట వద్ద నగరోత్సవంలో భక్తుల కోలాటం

జేసీ కేతన్ గార్గ్ బదిలీ

జడ్పీ సీఈఓ.. నగరపాలిక కమిషనర్ కూడా..



కేతన్‌గార్గ్

అనంతపురం టౌన్, జూలై 20: జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ బదిలీ అయ్యారు. రెండున్నరేళ్ల క్రితం ఆయన జిల్లాకు జేసీగా వచ్చారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత బదిలీ అనివార్యమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 62 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో జేసీ కేతన్‌గార్గ్ కూడా ఉన్నారు. ఆయనను రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌లకు ఆయన పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. జిల్లా పరిషత్ సీఈఓ, ఐఏఎస్ అధికారి వైకోమ్ నిదియాదేవిని కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. రాజంపేట సబ్ కలెక్టర్‌గా ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికలకు ముందు ఆమె జెడ్పీ సీఈఓగా వచ్చారు. సర్వశిక్ష అభియాన్‌కు ఏపీసీగా కూడా పనిచేస్తున్నారు. అనంతపురం నగరపాలిక కమిషనర్ మేఘస్వరూప్‌ను మదనపల్లి సబ్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. వారి స్థానంలో జిల్లాకు జాయింట్ కలెక్టర్, జడ్పీ సీఈఓ, నగరపాలిక కమిషనర్‌గా ఎవరినీ నియమించలేదు.

సంపత్‌ను ఆపేశారా..?

బాధ్యతలు చేపట్టని విద్యుత్ శాఖ ఎస్‌ఈ
ఉదయం నుంచి రాత్రి వరకూ హైడ్రామా
రీ పోస్టింగ్ కోసం సురేంద్ర ప్రయత్నాలు..?

అనంతపురం రూరల్, జూలై 20: విద్యుత్ శాఖ ఉమ్మడి జిల్లా ఎస్‌ఈ సంపత్‌కుమార్ బాధ్యతల స్వీకరణపై సందిగ్ధత నెలకొంది. అనంతపురం సర్కిల్ ఎస్‌ఈగా సంపత్‌కుమార్‌ను నియమిస్తూ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావు నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన శనివారం బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. ఉదయం 11 గంటల తరువాత ఆయన బాధ్యతలు చేపడుతారని శాఖలోని వారికి సమాచారం అందింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు, సిబ్బంది, ఉద్యోగ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. అదిగో.. ఇదిగో అంటూ మధ్యాహ్నం దాకా వేచి చూశారు. మూడు గంటలకు బాధ్యతలు చేపడుతారని సమాచారంతో కొందరు మళ్లీ వద్దామనుకుని వెళ్లిపోయారు. మరికొందరు అక్కడే ఉండిపోయారు. రాత్రి వరకు ఆయన కోసం ఎదురుచూశారు. కానీ ఆయన బాధ్యతల స్వీకరణను సీఎండీ నిలబెట్టినట్లు చర్చ జరుగుతోంది. ఇక్కడ పనిచేస్తున్న సురేంద్ర.. రీ పోస్టింగ్‌కు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. సురేంద్ర ఎస్‌ఈగా పనిచేసినంత కాలం వైసీపీ ప్రజాప్రతినిధులకు అంటకాగి పనిచేశారన్న విమర్శలున్నాయి. అన్నింటా వారికే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు, వర్కులు ఇవ్వడంలో తొలి ప్రాధాన్యం వైసీపీ వారికే ఇచ్చారని ఆయా వర్గాల్లో చర్చనడుస్తోంది. సబ్ స్టేషన్ల ఏర్పాటులోను వైసీపీ శ్రేణులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకున్నారన్న విమర్శలు వచ్చాయి. దీనికితోడు శాఖలోను ఒక వర్గానికే ప్రాధాన్యం ఇచ్చారని, వారు తప్పులు చేసినా వెనకేసుకొచ్చారని విమర్శలు ఉన్నాయి. కొత్తగా వస్తున్న సంపత్‌కుమార్ జిల్లా వాసి కావడం, గతంలోనూ ఇక్కడ పనిచేయడం గమనార్హం. అందరికీ సమప్రాధాన్యం ఇస్తారని కూడా అంటున్నారు. ఏం జరుగుతుందో వేచిచూడాలి.



ఎస్‌ఈ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

ఆటోడ్రైవర్ దారుణ హత్య

తలపై బండరాయితో మోది చంపిన వైనం



సూర్యనారాయణ (ఫైల్), విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మవరం రూరల్, జూలై 20: మండలంలోని సీసీ కొత్తకోట గ్రామం వద్ద ఆటోడ్రైవర్ తాడిమర్రి సూర్యనారాయణ (48) దారుణంగా హత్య చేశారు. తలపై బండరాయితో మోది చంపేశారు. ధర్మవరం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడిమర్రికి చెందిన సూర్యనారాయణకు చెన్నేకొత్తపల్లి మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన కృష్ణవేణితో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. తరువాత సూర్యనారాయణ భార్య పుట్టినిల్లయిన వెల్దుర్తికి వెళ్లి, అక్కడే ఉంటుండేవాడు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆటో తోలుకుంటూ ధర్మవరం వెళ్లాడు. అదేరోజు రాత్రి సీసీ కొత్తకోట వద్ద గుర్తుతెలియని వ్యక్తులు.. సూర్యనారాయణ తలపై బండరాళ్లతో మోది, హత్య చేశారు. శనివారం ఉదయం అటుగా వెళ్లినవారు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నరేంద్ర.. హత్యాస్థలాన్ని పరిశీలించి, కుటుంబీకులకు సమాచారం అందించారు. సూర్యనారాయణ భార్య కృష్ణవేణి, కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని, బోరున విలపించారు. డాగ్‌స్క్వాడ్‌తో పరిశీలించారు. క్రిష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్యకు వివాహేతర సంబంధమా? భూతగాదాలా, ఇతర కారణాలున్నాయా అన్నకోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిందితులను త్వరలోనే పట్టుకుంటాం: ఎస్పీ

సూర్యనారాయణ హత్యకేసు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని జిల్లా ఎస్పీ రత్న తెలిపారు. రూరల్ పోలీసు స్టేషన్‌ను శనివారం ఆమె తనిఖీ చేశారు. సూర్యనారాయణ హత్య వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హత్యను సీరియస్‌గా తీసుకుని, నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. కేసు దర్యాప్తునకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ క్రిష్ణయ్య

అనంతపురం సెంట్రల్, జూలై 20: జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ క్రిష్ణయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు శనివారం ఉత్తుర్వులు జారీచేశారు. వీసీ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ క్రిష్ణయ్యకు ఉత్తర్వులు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన క్రిష్ణయ్యకు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సురేంద్రనాయుడు, ఆర్ఈఎఫ్ నాయకులు నాగభూషణం, మంజునాథ నాయుడు తదితరులు పుష్పగుచ్ఛాలందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి క్రిష్ణయ్యను సన్మానించారు.



ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ

ఇదేం స్టేషన్..? ఇట్లుంది..!

● అనంత రైల్వే స్టేషన్ నిర్వహణపై డీఆర్ఎం అసంతృప్తి ● సమస్యల పరిష్కారానికి ఆదేశాలు



స్టేషన్ ఆవరణలో పరిశీలిస్తున్న డీఆర్ఎం విజయ్‌కుమార్



సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలిస్తున్న డీఆర్ఎం

అనంతపురం న్యూటౌన్, జూలై 20: డీఆర్ఎం విజయ్‌కుమార్ తొలిసారి అనంతపురం రైల్వేస్టేషన్‌కు వచ్చారు. వివిధ విభాగాలను శనివారం తనిఖీ చేశారు. సమస్యలపై అసహనం వ్యక్తంచేశారు. భవన నిర్మాణాల్లో నాణ్యతాలోపాలను గుర్తించి ప్రశ్నలు గుప్పించారు. ఏజీఎం జయకుమార్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. 'నిర్మాణాలు ఇలా కూడా ఉంటాయా..? ప్రయాణికులకు పదికాలాలపాటు ప్రయోజనం కలిగేలా నిర్మించాలి కదా..?' అని ప్రశ్నించారు. స్టేషన్‌లో దెబ్బతిన్న గ్రానైట్, టైల్స్‌ను చూసి ఏమిటి ఈ పరిస్థితి అని ప్రశ్నించారు. అధికారులు డీఆర్ఎంకు దిమ్మతిరిగే సమాధానం ఇచ్చారు. ప్రయాణికులు లగేజీ బ్యాగులు తగిలించడంతో గ్రానైట్ డ్యామేజ్ అయిందని అన్నారు. దీంతో 'ప్రయాణికులు బ్యాగులు లేకుండా వస్తారా..? నాణ్యమైన గ్రానైట్ వాడాలి కదా..?' అని ప్రశ్నించారు. దీనికి ఇంజనీరింగ్ అధికారుల వద్ద సమాధానం కరువైంది. స్టేషన్ ఆవరణలోని ప్రతి గదినీ డీఆర్ఎం తనిఖీ చేశారు. తాళం వేసిన వాటిని కూడా వదల్లేదు. సిగ్నలింగ్ రూంలో వెంటిలేటర్స్ లేకపోవడంతో ప్రశ్నించారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. ఎక్కడి సామగ్రి అక్కడే ఉండటంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్పు రాకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మురుగు నీటిలో ప్రయాణికులు వెళ్లాలా అని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. స్టేషన్ మేనేజర్ అశోక్ కుమార్‌ను పిలిపించి, నిర్వహణ అధ్వానంగా ఉందని అన్నారు. స్టేషన్‌లో చాలా సమస్యలున్నాయని, మరోసారి తాను వస్తానని, ఈలోగా అన్నింటినీ పరిష్కరించాలని సూచించారు. లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఏడీఆర్ఎం సుధాకర్, డీఈఎన్ వెస్ట్ మనికంఠ, సీనియర్ డీఓఎం శ్రావన్, డీఎస్‌టీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



తుంగభద్ర డ్యాంలో వరదనీరు

నిండుకుండలా టీబీ డ్యాం

దిగువ ప్రాంతాలకు ప్రమాద హెచ్చరికలు జారీ

కణేకల్లు/బొమ్మనహాళ్, జూలై 20: రాయలసీమకు తాగు, సాగునీటిని అందించే తుంగభద్ర డ్యాం శనివారం నీటితో నిండుకుండలా మారింది. దీంతో డ్యాం దిగువ ప్రాంతాల ప్రజలకు అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. 1,03,956 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్న డ్యాంలో దాదాపు 68 టీఎంసీల నీరు చేరుకుంది. దీంతో ఏ క్షణమైనా గేట్లు ఎత్తి నీటిని దిగువ వైపునకు వదిలేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగా డ్యాం దిగువ ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డ్యాం కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి శనివారం ప్రకటన విడుదల చేశారు. ఏ క్షణంలోనైనా డ్యాం గేట్లు ఎత్తి నీటిని హగరిలోకి విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. విషయాన్ని ఆయా గ్రామాలలో అధికారులు మైకుల, దండోరా ద్వారా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. రెవెన్యూ పోలీస్, పంచాయతీ అధికారులు కూడా తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. డ్యాం ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతోపాటు డ్యాంకు ఇన్‌ఫ్లో పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

28న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20: బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28వతేదీన ఆర్ట్స్ కళాశాలలో జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్ మోహిద్దీన్, కార్యదర్శి వెంకటేశులు తెలిపారు. సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల క్యాటగిరీల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. జూనియర్‌కి 2005 జనవరి 2వ తేదీ తరువాత జన్మించి ఉండాలని, సబ్ జూనియర్స్‌కు 2009 జనవరి 2వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు సబ్‌జూనియర్ అన్నవరం, జూనియర్ విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు యూని ఫాం, క్రీడాసామగ్రి, జననధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9966188133, 8919428343లను సంప్రదించాలని కోరారు.

టమోటా కిలో రూ.56

అనంతపురం రూరల్, జూలై 20: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.56తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం 450 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.48, కనిష్ఠ ధర రూ.35 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, జూలై 20: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1045టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం

రూ.23,52,000 బదిలీ చేయించుకున్న వైనం

హిందూపురం, జూలై 20: పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో సింధు అనే మహిళకు ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేసిన సంఘటన శనివారం వెలుగుచూసింది. వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు సింధు అనే మహిళ ఏడాది కిందటి వరకు బెంగళూరులో ఐటీ ఉద్యోగం చేసింది. గతకొంతకాలంగా అనారోగ్యంతో ఇంట్లో ఉంది. ఈ తరుణంలో ఈనెల 15న ఆమెకు ఫోన్‌కాల్ వచ్చింది. మీకు వర్క్‌ఫ్రంహోమ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారు. దీంతో ఆమె రూ.2వేలు నగదు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరడంతో పంపింది. కొంతసేపటికే ఆమెకు రూ.2,800 నగదు వాపసు వచ్చింది. ఆ తరువాత వారు చెప్పిన విధంగా నాలుగైదుసార్లు రూ.23,52,840 పంపింది. అయితే రెండ్రోజులుగా ఫోన్‌కాల్ చేసిన వ్యక్తి నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి బ్యాంక్ వద్దకు వెళ్లి విచారించగా అది మోసపూరితకాల్ అని చెప్పారు. దీంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు సింధు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మాచర్లలో అనంత విద్యార్థి ఆత్మహత్య



పవన్‌కుమార్

పుట్లూరు, జూలై 20: పల్నాడు జిల్లా మాచర్లలో బీటెక్ చదువుతున్న పవన్‌కుమార్ (23) శుక్రవారం అర్ధరాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మండలంలోని చాలవేముల గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రమాదేవి దంపతుల కుమారుడు పవన్‌కుమార్. తండ్రి శ్రీనివాసులు డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పవన్‌కుమార్ మాచర్ల పట్టణంలోని న్యూటన్స్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్ రూంలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ప్రేమ వ్యవహారమే ఆత్మహత్యకు కారణమని తెలుస్తోంది.

దగ్గుపాటికి తెలంగాణ సీఎం శుభాకాంక్షలు



సీఎం రేవంత్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జూలై 20: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సమ్మిట్ (కేజీఎఫ్)కు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఇదే క్రమంలో తెలంగాణ సీఎం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎంను ఎమ్మెల్యే కలవగా ఆయనకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కమ్మగ్లోబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కుసుమ కుమార్, తానా అధ్యక్షుడు నిరంజన్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

శవ రాజకీయాలు సిగ్గుచేటు

● తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ


మాట్లాడుతున్న తెలుగు యువత నాయకుడుబంగి నాగ

అనంతపురం అర్బన్, జూలై 20: వినుకొండలో వ్యక్తిగతంగా జరిగిన హత్యపై జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయరంగు పులిమి శవ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సత్యకుమార్, వడ్డే హనుమంత రావు, వన్నూరు, రామాంజనేయులు, సుజాతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మాజీ సీఎం జగన్ హత్యా రాజకీయాలు చేశారన్నారు. వందలాది మంది టీడీపీ కార్యకర్తలను పొట్టనపెట్టుకున్న దుర్మార్గుడు జగన్ అన్నారు. ఎమ్మెల్సీ డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్‌డెలివరీ చేస్తే ఎమ్మెల్సీని వెనకేసుకొచ్చారన్నారు. జగన్ సొంత జిల్లాలో దళిత మహిళను హత్య చేసినా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించలేదన్నారు. వినుకొండలో వైసీపీ కార్యకర్తలు గంజాయి మత్తులో గొడవపడి హత్య చేస్తే వాస్తవాలను తొక్కిపెట్టి టీడీపీకి అంటగట్టడం సిగ్గుచేటన్నారు. అనిల్‌కుమార్, సాయికుమార్, ప్రసాద్, జనార్ధన్, శ్రీనివాసులు, ఆంజనేయులు, కృపాకర్, మాధవ్, శివ, ఉదయ్‌కుమార్, అరవింద్ పాల్గొన్నారు.

సరసమైన ధరలకే బియ్యం, కందిపప్పు


సరుకులను పంపిణీ చేస్తున్న సీఎస్‌డీటీ, టీడీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, జూలై 20: పేదలకు సరసమైన ధరలకే బియ్యం, కందిపప్పును అందించడానికి సీఎం చంద్రబాబు ప్రత్యేకచర్యలు చేపట్టారని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి అన్నారు. శనివారం చెన్నేకొత్తపల్లిలో ఈరంటి రత్నమయ్య కిరాణ దుకాణం వద్ద పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పలువురికి బియ్యం, కందిపప్పును అందజేశారు. కిలో కందిపప్పు రూ.160, స్టీమ్డ్ బీపీటీ బియ్యం రూ.49, పచ్చి బీపీటీ బియ్యం కిలో రూ.48కే అందిస్తున్నట్లు సీఎస్‌డీటీ సావిత్రి తెలిపారు. టీడీపీ నాయకులు అంకే అమరేంద్ర, వడ్డే దుర్గ, రామాంజి, నరసింహులు, అమరేంద్రరెడ్డి, బన్యాల సూర్యనారాయణ, నాగరాజు, మహేశ్, కానశివారెడ్డి, రామస్వామి, శ్రీధర్, మల్లికార్జున పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు


బండమీదపల్లిలో బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, జూలై 20: మండలంలోని బండమీదపల్లి గ్రామంలో పశువులు, ప్రజలకు తాగునీటి కోసం శనివారం టీడీపీ నాయకులు బోరు వేయించారు. గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని పరిష్కరించాలని గ్రామస్థులు ఎన్నికల ప్రచార సమయంలో పరిటాల సునీతను కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బోరు వేయించి నీటి సమస్య పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు శనివారం బోరు వేయించగా మూడు ఇంచుల నీరు పడ్డాయి. గ్రామస్థులు దగ్గుపాటి శ్రీనివాసులు, నెట్టెం లక్ష్మి నారాయణ, వెంకట్రాముడు, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన జడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం విద్య, జూలై 20: నూతన ఎస్పీ మురళీకృష్ణను ఉమ్మడి జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కలిశారు. శనివారం డీపీఓలో ఉన్న ఎస్పీని ఆమె మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. కొత్తగా జిల్లాకు వచ్చిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వీసీని కలిసిన బాలాజీ విద్యాసంస్థల సభ్యులు

అనంతపురం రూరల్, జూలై 20: శ్రీకృష్ణదేవరాయ వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సుదర్శన్ రావును శ్రీ బాలాజీ విద్యాసంస్థల సభ్యులు శనివారం కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఏఓ మనోహర్‌రెడ్డి వీసీని కలసిన వారిలో ఉన్నారు.

కుష్టు నివారణకు కృషి చేయాలి

గార్లదిన్నె, జూలై 20: కుష్టు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి గౌతమి సూచించారు. శనివారం మండలంలోని మర్తాడులో కుష్టు వ్యాధి నిర్ధారణకు చేపట్టిన ఇంటింటా సర్వేను ఆమె పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ వ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి మల్టీ డ్రగ్ థెరపి ద్వారా పూర్తిగా నివారించవచ్చునన్నారు.

ఉద్యమంలా.. మొక్కలు నాటే పండుగ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20: జిల్లాలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేస్తూ ఉద్యమంలా మొక్కలు నాటే పండుగ చేపట్టాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబుళమ్మ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో డీఆర్‌డీఏ-వెలుగు మండల సమాఖ్యల సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జిల్లాలోని డ్వాక్రా సంఘాల మహిళల ద్వారా ప్రతి ఇంటికి మొక్కల ప్రాధాన్యత, మొక్కలు పెంపకం చేపట్టే కార్యక్రమంపై కనీస అవగాహన కల్పించి, చైతన్యం చేయాలని సూచించారు. నాణ్యమైన మొక్కలు సరఫరా చేయాలని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షిస్తూనే, కార్యాలయాలు, నివాసాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై అవగాహన కల్పించాలన్నారు. ఏపీడీ ఈశ్వరయ్య, డీపీఎం, ఏపీఎం, మండలసమాఖ్యల అకౌంటెంట్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబుళమ్మ

నేడు గురుపౌర్ణమి

వేడుకలకు ముస్తాబైన సాయిమందిరాలు

అనంతపురం కల్చరల్, జూలై 20: సద్గురు సాయినాథుని జయంతి గురుపూర్ణిమ వేడుకలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పలు సాయిమందిరాల్లో రెండురోజుల క్రితం నుంచే సంబరాలను ప్రారంభించారు. సాయిసచ్చరిత్ర పారాయణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నగరోత్సవాలు నిర్వహించారు. గురుపౌర్ణమి నేపథ్యంలో ఆదివారం నిర్వహించనున్న వేడుకలకు ఇప్పటికే ఆలయాలన్నింటినీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయాలకు నూతన రంగులు వేయడంతో పాటు విద్యుద్దీపాలంకరణలతో అలంకరించారు. జిల్లా వ్యాప్తంగా వున్న సాయి మందిరాలన్నీ ఆదివారం భక్తులతో కిటకిటలాడనున్నాయి. భక్తుల తాకిడిని దృష్టిలో వుంచుకుని పలు ఆలయాల వద్ద ప్రత్యేకంగా షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. మూడవరోడ్డు షిర్డిసాయి ఆలయంలో శనివారం నుంచే అఖండ సాయి సచ్చరిత్ర పారాయణం పఠించారు. వేడుకల్లో భాగంగా ఆలయాల్లో సాయిసత్య వ్రతాలతోపాటు విశేషాలంకరణలు, ప్రత్యేక పూజాదులు నిర్వహించనున్నారు. అనంతపురం


విద్యుల్‌దీప కాంతులతో వెలుగొందుతున్న చెరువుకట్ట షిర్డీసాయి ఆలయం

నగరంలోని పురాతన ఆలయమైన చెరువుకట్ట షిర్డిసాయి ఆలయం, వేణుగోపాల్‌నగర్ సద్గురు సాయినాథ్ మందిరం, మూడవరోడ్డులోని షిర్డిసాయి ఆలయం, వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా వున్న సాయిమందిరం, శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమం, హెచ్చెల్సీ కాలనీలోని సాయిబాబా ఆలయాలతోపాటు అన్ని ప్రాంతాల్లోని సాయిమందిరాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు.


వేణుగోపాల్ నగర్ సద్గురు సాయినాథ మందిరం


మూడో రోడ్డు ఆలయంలో సాయి సచ్చరిత్ర పారాయణం

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం

అనంతపురం కల్చరల్, జూలై 20: ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏడుశనివారాల వ్రతాలను కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో స్వామివార్ల మూలవిరాట్‌లను వివిధ రకాల పుష్పాలతో నేత్ర మనోహరంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులు మంత్రాలు వల్లిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నదానం చేశారు.


పూజలందుకుంటున్న స్వామివార్లు


ఏడుశనివారాల వ్రతం ఆచరిస్తున్న భక్తులు

ట్రిపుల్ ఐటీకి విద్యార్థి ఎంపిక

నార్పల, జూలై 20: ఇడుపులపాయ ట్రిపుల్ టీకి కేశేపల్లి విద్యార్థి భానుప్రకాష్ ఎంపికయ్యాడు. మండలంలోని కేశేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన భానుప్రకాష్ పదో తరగతిలో 569 మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచాడు. విద్యార్థిని పాఠశాల హెచ్‌ఎం ఎం జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.


భానుప్రకాష్

విశాఖ, నార్త్, సౌత్‌జట్ల గెలుపు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20: మహిళా క్రికెట్ పోటీల్లో విశాఖపట్నం, నార్త్, సౌత్ జట్లు విజయం సాధించాయి. శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ మహిళా జోనల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం, సెంట్రల్‌జోన్ జట్లు తలపడగా... విశాఖపట్నం జట్టు నిర్ణీత 50ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 297పరుగులు చేసింది. హర్షిత 68పరుగులు, లహరి 60పరుగులు సాధించారు. అనంతరం బరిలోకి దిగిన సెంట్రల్‌జోన్ 50ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 144పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. మరో మ్యాచ్‌లో చిత్తూరు, నార్త్ జోన్ జట్లు పోరు జరగగా...చిత్తూరు జట్టు నిర్ణీత 50ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 202పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన నార్త్‌జోన్ 47.5ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. సరయు 110పరుగులు చేసింది. కృష్ణ, సౌత్‌జోన్ జట్లు పోటీ పడగా.. సౌత్‌జోన్ నిర్ణీత 50ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కృష్ణ 40.4 ఓవర్లలో 120పరుగులకు ఆలౌట్ అయ్యింది. శరణ్య 4వికెట్లు తీసింది. సౌత్‌జోన్ 110పరుగుల తేడాతో విజయం సాధించింది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధుఆచారి, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు

అనంతపురం క్లాక్ టవర్, జూలై 20: జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ కృష్ణయ్యకు నాయకులు అభినందనలు తెలిపారు. ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్, సభ్యులు అజిత, సుబ్బన్న, శ్రీధర్ కృష్ణయ్యకు శనివారం జేఎన్‌టీయూ పరిపాలనాభవనంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గెజిటెడ్ ఉద్యోగులు

నిత్యావసర సరుకుల వితరణ

అనంతపురం కల్చరల్, జూలై 20: ఆర్థిక కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేసి నిత్యసురభి ట్రస్టు అండగా నిలిచింది. హౌసింగ్‌బోర్డులో నివాసముంటున్న వెంకప్ప, పద్మావతి దంపతులు అనారోగ్యంతో బాధపడుతూ ఏ పనీ చేయలనేని స్థితిలో ఉన్నారు. వీరి ఆర్థిక ఇబ్బందులను గమనించిన ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలా మురళి శనివారం ఆ కుటుంబాన్ని కలిసి మూడు నెలలకు సరిపడ నిత్యావసర సరుకులు అందజేశారు. ట్రస్టు సభ్యులు సౌదామిని, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చట్టాలపై దివ్యాంగులకు అవగాహన

రామగిరి, జూలై 20: మండలంలోని నసనకోట గ్రామంలో టింబక్టు కలెక్టివ్ సహకారంతో ప్రతిభా వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో లీగల్‌క్యాంపు శనివారం నిర్వహించారు. సొసైటీ డైరెక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ దివ్యాంగులు చట్టాలపై అవగాహన కల్గిఉండాలన్నారు. మేనరికపు వివాహాలు చేసుకోవడం వల్ల సంతానంలో దివ్యాంగులు పుట్టడం, అనారోగ్యంసమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. మిళిత సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

చెస్ టోర్నీలో ఏ1 అకాడమీ క్రీడాకారుల ప్రతిభ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20: ప్రపంచ చెస్ దినోత్సవం సందర్భంగా గుంతకల్లులో నిర్వహించిన ఫిడే గిన్నిస్ వరల్డ్ రికార్డు చెస్ టోర్నమెంట్‌లో నగరానికి చెందిన ఏ1 చెస్ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చాటారు. అండర్-5 బాలురలో సంతోష్ ప్రథమ స్థానం, అండర్-6 లో నిర్గున్‌రెడ్డి ద్వితీయ స్థానం, అండర్-9లో సంజయ్ సాహల్ తృతీయ స్థానం, అండర్-12లో దర్శన్ ప్రథమ స్థానం, నితీష్ తృతీయ స్థానం, అండర్-13లో హర్ష ప్రథమ స్థానం సాధించారు. బాలికల విభాగంలో అండర్-7లో కాశి సమిక ప్రథమ స్థానం, ఇషా ద్వితీయ స్థానం, అండర్-8లో హియాకృతి ప్రథమ స్థానం, అండర్-10లో ధన్యశ్రీ ప్రథమ స్థా నం, అండర్-13లో కాశీ నమిక ప్రథమ స్థానం, అండర్-14లో పూర్ణమ్మ ప్రథమ స్థానం, అండర్-15లో కటారి భువనకృతి ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలను ఇంటర్నేషనల్ ఆర్బిటార్ ఉదయ్‌కుమార్ నాయుడు, ఏ1 చెస్‌అకాడమీ డైరెక్టర్ తులసమ్మ, శిక్షకులు గోవిందరాజులు, మహారాజ్ అభినందించారు.



విజేతగా నిలిచిన ఏ1 చెస్ అకాడమీ క్రీడాకారులు

క్రికెట్ టోర్నీలో డీపాల్, మాంటిస్సోరి జట్ల విజయం


సెయింట్ డీపాల్ పాఠశాల బాలికల జట్టుకు కప్‌ను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 20: స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ బాలికల విభాగంలో సెయింట్ విన్సెంట్ డీ పాల్, బాలురలో మాంటిస్సోరి స్కూల్ జట్లు విజేతలుగా నిలిచాయి. శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో ఆర్డీటీ జిల్లాస్థాయి స్కూల్ క్రికెట్ టోర్నీ ఫైనల్ పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో నిర్వహించిన ఫైనల్‌లో సెయింట్ విన్సెంట్ డీపాల్, రాప్తాడు ఏపీ మోడల్‌స్కూల్ జట్లు తలపడగా డీపాల్ జట్టు 12 ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 120పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన మోడల్ స్కూల్ 12ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 44పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది. బాలుర మ్యాచ్‌లో మాంటిస్సోరి స్కూల్, ఆర్డీటీ ప్రత్యేక హైస్కూల్ జట్లు పోరులో మాంటిస్సోరి 15 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. అనంతరం ఆర్డీటీ స్పెషల్ స్కూల్ 14.4 ఓవర్లలో 87పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. బాలికల్లో విజేతగా సెయింట్ విన్సెంట్ డీపాల్, రన్నర్‌గా రాప్తాడు మోడల్ స్కూల్ నిలవగా, బాలుర విభాగంలో విజేతగా మాంటిస్సోరి, రన్నర్‌గా ఆర్డీటీ స్పెషల్ హైస్కూల్ జట్లు నిలిచాయి. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ స్కూల్ డైరెక్టర్ రామ్‌కమల్, క్రికెట్ కోఆర్డినేటర్ యుగంధర్‌రెడ్డి, కోచ్‌లు గాంధీ, కుమార్, ప్రవీణ్, మధుసూదన్ నాయక్, పీఈటీలు నరేష్, నారాయణరెడ్డి, శేఖర్, శంకర్, మల్లికార్జున పాల్గొన్నారు.


విజేతగా నిలిచిన మాంటిస్సోరి పాఠశాల జట్టు

మొక్కలు నాటుదాం... పర్యావరణాన్ని కాపాడుదాం


కోటంక పాఠశాలలో మొక్క నాటుతున్న విద్యార్థులు

గార్లదిన్నె, జూలై 20: విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని అటవీశాఖ బీట్ ఆఫీసర్ నీలవేణి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కోటంక ఉన్నత పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నార్పల: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ రాముడు పిలుపునిచ్చారు. హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రంగాపురం, నార్పల క్రాస్‌లో శనివారం ఎంపీడీఓ మొక్కలు నాటారు. రంగాపురం సర్పంచు కుళ్లాయప్ప, ఉపాధి హామీ ఏపీఓ ఎర్రమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ హరినాథ్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శింగనమల: మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ బి.వెంకటరమణ, వైస్ ఎంపీపీ విజయమ్మ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఎంఈఓ నరసింహరాజు, ఏపీఓ శ్రీదేవి, ఏవో శ్రీనివాసులు, ఈఓపీఆర్‌డీ మురళీకృష్ణ, రామాంజనేయులు, అక్బర్, ప్రభాకర్, బాలకృష్ణ పాల్గొన్నారు.


శింగనమలలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ, వైస్ ఎంపీపీ

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● ఎంపీకి సంఘం నాయకుల వినతి


ఎంపీ అంబికాకు సమస్యలు వివరిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

అనంతపురం అర్బన్, జూలై 20: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శనివారం నగరశివారులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు గోపీ కృష్ణ, శ్రీరాములునాయక్, సాంబశివమ్మ, నాగరాజు, ఓబిరెడ్డి, ఈశ్వరయ్య, నాగార్జున, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, వరప్రసాద్ కలిసి పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. సచివాలయ ఉద్యోగులకు ఎలాంటి సర్వీస్ నిబంధనలు, ప్రమోషన్ చానల్స్, జాబ్ చార్ట్ లేకుండా ఐదేళ్లల్లో అనేక రకాల పనులు చేయించి తీవ్ర పని ఒత్తిడికి గురిచేశారన్నారు. ఈనెల 28న జిల్లా కేంద్రంలో జరిగే సచివాలయ ఉద్యోగుల సదస్సుకు హాజరు కావాలని కోరారు. ఇందుకు ఎంపీ స్పందిస్తూ సచివాలయ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నాయకులు శివశంకర్, మహేష్‌నాయక్, హనుమంతు, భగీరథరెడ్డి, రామాంజనేయులు, విజయ్, మణిదీప్, సాయి తేజ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీని కలిసిన నటేష్ చౌదరి

అనంతపురం సెంట్రల్, జూలై 20: జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సుదర్శన రావును శనివారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నటేష్ చౌదరి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పారదర్శకమైన పాలనకు నిదర్శనమైన జేఎన్‌టీయూను గత వైసీపీ ప్రభుత్వంలో చెడ్డపేరు తీసుకువచ్చారని, దీనిని తొలగించి, పురోగాభివృద్ధివైపు పయనించేలా కృషిచేయాలని నటేష్‌చౌదరి వీసీని కోరారు. అనంతరం కాంట్రాక్టర్ మురళీకృష్ణ కలిసి వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.


వీసీని సన్మానిస్తున్న నటేష్ చౌదరి

చెత్త తొలగింపు..!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం టౌన్, జూలై 20: హమ్మయ్య డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో చెత్త కుప్పను తొలగించారు. వారం రోజులుగా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని రెండో అంతస్తులో ఓ మూలన చెత్తకుప్ప దర్శనమిస్తోంది. దీనిపై ఆంధ్రజ్యోతిలో 'మేడం... అక్కడ కాదు... ఇక్కడ చూడండి..!' అనే కథనం ప్రచురితమైంది. కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర అన్నిశాఖల అధికారులు, వివిధ వర్గాల ప్రజల నుంచి కామెంట్లు వచ్చాయి. రాష్ట్రస్థాయిలో ఉన్న ఓ వైద్యాధికారి అనంత వైద్యశాఖ గ్రూపులో ఈ కథనాన్ని ట్యాగ్ చేసి మేడమ్ మన కార్యాలయాన్ని శుభ్రం చేసుకోండని కామెంట్ పెట్టినట్లు ఆ వర్గాల ద్వారా తెలిసింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి చెత్త తొలగించకపోవడాన్ని గుర్తించి వివిధ శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్పందించిన అధికారులు వెంటనే ఆ చెత్త కుప్పను ఎత్తివేయించి అక్కడ శుభ్రం చేయడం చూసిన కార్యాలయంలోని ఉద్యోగులు హమ్మయ్య చెత్తను తొలగించారంటూ ఆనందం వ్యక్తం చేశారు.


డీఎంహెచ్‌ఓ ఆఫీస్‌లో చెత్తను తొలగించిన దృశ్యం

టీ తాగడానికి వెళ్లి... డివైడర్‌ను ఢీకొన్న కారు

● బీటెక్ విద్యార్థి మృతి

అనంతపురం క్రైం, జూలై 20: స్నేహితులంతా కలిసి టీ తాగడానికి వెళ్లేందుకు కారులో బెంగళూరు బైపాస్ పక్కన ఉన్న హైదరాబాద్ చెఫ్‌కు శనివారం బయలుదేరారు. ఈ క్రమంలో రుద్రంపేట బైపాస్ పక్కన షైహోం ఫర్నీచర్ షాపు వద్దకు రాగానే ఏదో అడ్డువచ్చిందని డ్రైవ్ చేస్తున్న యువకుడు కారును డివైడర్ పైనున్న పోల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నగరంలోని నీరుగంటి వీధికి చెందిన బీటెక్ విద్యార్థి సాయి జశ్వంత్ రెడ్డి(22) మృతిచెందాడు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు జశ్వంత్‌రెడ్డి స్నేహితులు నిఖిల్‌రాజు, ప్రేమ్‌సాయి, ఫణిదత్తా, మాధవ్‌లను కలిశాడు. అందరూ తపోవనం నుంచి హైదరాబాద్ చెఫ్ దగ్గరకు టీ తాగడానికి కారులో బయలుదేరారు. షైహోం ఫర్నీచర్ దుకాణం ఎదుట ఏదో అడ్డొచ్చిందని కారును పక్కకు తిప్పాడు. అంతే కారు డివైడర్ మధ్యనున్న పోల్‌ను ఢీకొని బోల్తా పడింది. దీంతో అందరూ కారులో నుంచి ఎగిరి పడ్డారు. తీవ్రగాయాలకు గురైన జశ్వంత్‌రెడ్డిని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు నుంచి పడి వెలుగు సీసీకి గాయాలు

చెన్నేకొత్తపల్లి, జూలై 20: ప్రమాదవశాత్తు బస్సులో నుంచి కిందపడి డీఆర్‌డీఏ వెలుగు ఉద్యోగి తీవ్రంగా గాయపడిన సంఘటన చెన్నేకొత్తపల్లిలో శనివారం చోటు చేసుకుంది. తోటి సిబ్బంది తెలిపిన మేరకు చెన్నేకొత్తపల్లిలో రుద్రమదేవి మండల సమాఖ్యలో ఆనంద్‌కుమార్ సీసీగా పనిచేస్తున్నారు. విధులలో భాగంగా అనంతపురం నుంచి ఆర్టీసీ బస్సులో చెన్నేకొత్తపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో సీకేపల్లి సమీపంలోకి బస్సు రాగా దిగడానికి డోరు మెట్లపై నిల్చుని ఉండగా ఉన్నపలంగా జారి కిందకుపడ్డాడు. దీంతో ఆనంద్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఏరియా కో ఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి, ఏపీఎం అనసూయ ఆస్పత్రి వద్దకు చేరుకుని పరిస్థితిని వైద్యసిబ్బందిని అడిగితెలుసుకున్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

గోవా మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

శింగనమల, జూలై 20: మండలంలోని ఉల్లికల్లు గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యాన్ని శింగనమల ఎస్ఐ చంద్రశేఖర్ సీజ్ చేశాడు. పెద్దపప్పూరు మండలం అమ్మలదిన్నె గ్రామానికి చెందిన నల్లని శివప్రసాద్ ఇతర ప్రాంతాల నుంచి మద్యం తెచ్చి అమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున శివ ప్రసాద్ 960 బాటిళ్ల గోవా మద్యాన్ని ఎంపీ02ఏఎన్261 కారులో అమ్మలదిన్నెకు ఉల్లికల్లు మీదగా తరలిస్తుండగా అందించిన సమాచారం మేరకు పోలీసులు వాహనాలు చేస్తున్నారు. కారులో ఉన్న గోవా మద్యాన్ని గమనించిన ఎస్ఐ మద్యంతో పాటు కారును సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

జనసేన సభ్యత్వ నమోదు

పుట్లూరు, జూలై 20: మండలకేంద్రంలో శనివారం జనసేనపార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. జనసైనికులు ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేయించుకొని బీమా సదుపాయం పొందాలని నాయకులు కుల్లాయప్ప తెలిపారు. కార్యక్రమం ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రవి, సుధాకర్, వెంకటశేఖర్, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

యాడికి, జూలై 20: మినీ గోకులాల ఏర్పాటు కోసం అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెటర్నరీ డాక్టర్ విజయలక్ష్మి శనివారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మినీ గోకులాలు, గొర్రెల, మేకల షెడ్లు, కోళ్ల షెడ్లు ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుఫారం, ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, స్థలహక్కుపత్రం, బ్యాంక్ పాసుపుస్తకం తీసుకొని రావాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు పశువైద్యశాలలోగాని, రైతుసేవా కేంద్రంలో గాని సంప్రదించాలని చెప్పారు.

ఘనంగా గంధం వేడుకలు

యల్లనూరు, జూలై 20: మొహరం వేడుకల్లో భాగంగా శనివారం కూచివారిపల్లి గ్రామంలో గంధం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలాలిస్వామికి గ్రామస్థులు పానకాలు సమర్పించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారంతో వేడుకలు ముగుస్తాయని చెప్పారు.

2న అన్నాభిషేకం

తాడిపత్రి, జూలై 20: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆగస్టు 2వ తేదీ స్వామివారికి అన్నాభిషేకం, పార్వతీదేవి అమ్మవారికి శాకాంబరీదేవి అలంకరణ నిర్వహించనున్నట్లు అర్చకుడు శంకరయ్యశర్మ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆరుద్రా నక్షత్రం మాసశివరాత్రిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు చేయనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విఠోబాస్వామికి ఐరావత వాహన సేవ

పామిడి, జూలై 20 : పట్టణంలోని శ్రీ రంగ సుబేఫిర్కా భగవాన్ దాస్ విఠోబాస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకలు తొలుత మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణలు, పూజలు, అర్చనలు చేశారు. తర్వాత మంగళవాయిద్యాల నడుమ ఐరావత వాహనంపై ఉత్సవమూర్తిని కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో రుక్మిణిదేవి, విఠోబాస్వామి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి వేకడలో పాల్గొన్నారు. సాయంత్రం భజన, హరికథ కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా పల్లకీ సేవ



స్వామి వారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, జూలై 20: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అర్చకులు పల్లకీసేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు జరిపారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తాడిపత్రి, జూలై 20: గురుపూర్ణిమను పురస్కరించుకుని పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయాల్లో శనివారం నుంచే ప్రత్యేకపూజలు మొదలుపెట్టారు. సంజీవనగర్‌లో ఉన్న శివసాయి మందిరంతో పాటు శివాలయంరోడ్డు , కడపరోడ్డు, సజ్జలదిన్నె, నందలపాడులలోని షిర్డీసాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు బాబాకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, అలంకరణలు చేసి విష్ణుసహస్రనామ పారాయణం, భజనలు, పల్లకిసేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం ఆయా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు అంగరంగవైభవంగా జరగనున్నాయి.

హనుమంతరాయస్వామికి జలధి పూజ

బెళుగుప్ప, జూలై 20: మండలంలోని దుద్దేకుంటలో హనుమంతరాయస్వామి జలధి పూజను శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అలాగే గ్రామదేవత దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గ్రామస్థులు గ్రామ సమీపంలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో గంగపూజ చేసి అక్కడి నుంచి కలశంలో గంగను ఊరేగింపుగా తీసుకొచ్చి హనుమంతరాయస్వామిని, దుర్గమ్మను అభిషేకించారు. అనంతరం అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. ప్రతియేటా ఆషాఢ మాసం మూడో శనివారం సందర్భంగా జలధి పూజలు చేయడం అనవాయితీగా వస్తోందని గ్రామస్థులు తెలిపారు.

పాడిపశువులకు గర్భకోశ చికిత్స

తాడిపత్రి, జూలై 20: మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడిపశువులకు గర్భకోశచికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు సుధాకర్ లింగనిర్ధారణ, కృత్రిమ గర్భధారణ పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. పాడిపశువులు అనారోగ్యం బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం 35 పశువులకు గర్భకోశ చికిత్సలు అందించి మందులు పంపిణీచేశారు. పశువైద్యాధికారి హరికృష్ణ, గోపాలమిత్ర సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు సన్నాహాలు

కళ్యాణదుర్గం, జూలై 20 : కంబదూరు మండలకేంద్రంలో రోడ్డు విస్తరణకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆర్‌అండ్‌బీ ఏఈ గోవిందరాజులు, సచివాలయ సిబ్బంది, సర్వేయర్లు బృందంగా ఏర్పడి రోడ్డు విస్తరణకు మార్కింగ్ ఇచ్చారు. స్థానిక చెక్‌పోస్టు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని ఏఈ చెప్పారు. ఎంత మేరకు రోడ్డు విస్తరణ చేయాలి, ఏయే ప్రాంతంలో చేపట్టాలి అన్న అంశాలపై సర్వే చేశామన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి, రోడ్డు విస్తరణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రజారోగ్య రక్షణకు ప్రణాళికతో ముందుకెళ్లాలి

● ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచన

రాయదుర్గం, జూలై 20: సీజనల్ వ్యాధులను నియంత్రించి ప్రజా ఆరోగ్య రక్షణకు అందరూ సమష్టిగా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని డ్వామా హాల్లో శనివారం ఆయన మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులైన డయేరియా, మలేరియా,డెంగీ, టైఫాయిట్ లాంటివి అధికంగా ప్రబలే అవకాశం ఉందని, వాటిని కట్టడి చేసేందుకు మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకెళ్లాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇందుకు పారిశుధ్య నిర్వహణతో పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పైపులైన్ల లీకేజీలను అరికట్టాలన్నారు. జ్వరాలు, అనారోగ్యం బారిన పడిన వారిని గుర్తించి సకాలంలో చికిత్సలు అందించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైద్యుడు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: ఎంపీడీఓ

పామిడి, జూలై 20: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ చెట్లతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ శశికళ, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని తిలక్‌నగర్‌లో గల శ్రీచైతన్య పాఠశాల-సీ బ్రాంచ్‌లో ఆ పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణస్వామి, డీన్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ స్వాతి, సిబ్బంది మొక్కలు నాటారు.

బొమ్మనహాళ్: మండలంలోని లింగదహాళ్ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా, ఉద్దేహాళ్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర ఆవరణలో టీడీపీ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ మహేంద్ర, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, గొల్ల తిప్పేస్వామి, పయ్యావుల మోహన్, మాలపాటి ధనుంజయ, హనుమంతు, నవీన్, ఏపీఈఓ రమేష్, హెల్త్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



పామిడిలో మొక్కను నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తాడిపత్రి: మండలంలోని యర్రగుంటపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు, ఎంఈఓ నాగరాజు, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, రామాంజనేయులు, ఏపీఓ నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రూ.2లక్షల అవినీతి

● బహిరంగ సమావేశంలో అధికారుల వెల్లడి

● భారీగా అక్రమాలు జరిగాయని టీడీపీ శ్రేణుల ఆరోపణ

కుందుర్పి, జూలై 20: మండల కేంద్రంలో శనివారం ఉపాధి హామీ తనిఖీ వివరాలు వెల్లడించేందుకు బహిరంగ సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2023 మార్చి నుంచి 2024 జనవరి వరకు వివిధ శాఖల కింద రూ.8,44,71,393 ల వ్యయంతో జరిగిన ఉపాధి పనులపై ఇటీవల సామాజిక తనిఖీ నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి వివరాలను వెల్లడించేందుకు బహిరంగ సమావేశం ఏర్పాటు చేశా రు. ఇందులో కేవలం రూ. 2 లక్షల మాత్రమే అక్రమాలు జరిగినట్లు వెల్లడించారు. దీంతో టీడీపీ నాయకులు ఉపాధి పనుల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని, వాటిని వెలికితీయాలని డిమాండ్ చేశారు. దీంతో వైసీపీ నాయకులు జోక్యంచేసుకుని అలాందేమీ లేదని ఫీల్డ్ అసిస్టెంట్లకు వత్తాసు పలికారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని అందరినీ నిలువరిం చారు. ముగిసేంతవరకు సభ పోలీసుల సమక్షంలోనే జరిగింది. తెనగల్లు, జంబుగుంపల, కుందుర్పి గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని, బాధ్యులపై చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు రాఘవేంద్రబాబు, చెన్న రాయప్ప, రవి, శ్రీనివాసులు, గోపాల్ అధికారులకు వినతి పత్రాలను అంద జేశారు. గ్రామాల్లో వైసీపీ నాయకుల అండతో ఫీల్డ్ అసిస్టెంట్ లు పెద్దఎత్తున అక్రమాలు చేశారని బహిరంగంగా చర్చించుకుంటుంటే సామాజిక తనిఖీలో మాత్రం కేవలం రూ. 2 లక్షలు మాత్రమే అక్రమాలు జరిగాయని తెలిపారని, దీంతో కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందని ప్రజలు చర్చించుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి, ఏపీడీ రమేష్ నాయక్, ఎంపీడీవో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ప్రేమికుడి ఆత్మహత్యాయత్నం

బొమ్మనహాళ్, జూలై 20: ప్రేమికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బొమ్మనహాళ్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. శెట్టూరుకు చెందిన మనోజ్‌రెడ్డి బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి బొమ్మనహాళ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో కళ్యాణదుర్గంలో డిగ్రీ చదువుతున్న సమయంలో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. కొంతకాలం ఇద్దరూ ప్రాణంగా ప్రేమించుకున్నారు. కాగా ఇటీవల వీరి ప్రేమ విషయం అమ్మాయి తల్లిదండ్రులకు తెలియడంతో మనోజ్‌రెడ్డిని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఆమెకు వేరే సంబంధాన్ని కుదిర్చారు. ఈ విషయం తెలుసుకున్న మనోజ్‌రెడ్డి శనివారం ఆ అమ్మాయి స్వగ్రామానికి వచ్చి పెళ్లి చేసుకుంటానని బతిమిలాడాడు. దీంతో ఆమె కుటుంబసభ్యులు ఇక్కడి నుంచి వెళ్లిపో.. లేదంటే అంతు చూస్తానని బెదిరించారు. చేసేది లేక ఆ యువకుడు ఆ గ్రామంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి అతడిని బొమ్మనహాళ్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి బళ్లారి ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై బొమ్మనహాళ్ ఎస్ఐ శ్రీనివాసులును వివరణ కోరగా.. మనోజ్‌రెడ్డి, మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ అమ్మాయి ప్రేమించుకోవడం నిజమేనన్నారు. ఆ అమ్మాయికి పెద్దలు వేరే సంబంధం కుదిర్చారని, పెళ్లి చేసుకోవడం కుదరదు అని ఆమె కూడా మనోజ్‌రెడ్డికి చెప్పిందన్నారు. ఇందుకు మనస్తాపం చెందిన అతను ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేస్తే జరిమానా

● మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక

కళ్యాణదుర్గం రూరల్, జూలై 20: పట్టణంలోని ప్రధాన రహదారులపై, డ్రైనేజీ కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేస్తే జరిమానా తప్పదని మున్సిపల్ కమిషనర్ నర్సారెడ్డి శనివారం ప్రకటనలో దుకాణదారులను, ప్రజల్ని హెచ్చరించారు. ప్రస్తుత వర్షాకాలాన్ని దృష్టిలో వుంచుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తుగా చర్యలు చేపడుతున్నామన్నారు. డ్రైనేజీల్లో, రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ కవర్లు వేయడం ద్వారా అపరిశుభ్రత అధికమై దోమలు వ్యాప్తి చెందాతాయన్నారు. ఫలితంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. చెత్త, ప్లాస్టిక్ కవర్లను మున్సిపల్ ట్రాక్టర్లలోకి వేయాలని ఆదేశించారు. రోడ్డుపైన, డ్రైనేజీల్లో వేస్తే జరిమానా విధిస్తామన్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి

గుత్తి,జూలై 20: మోటార్ వాహనాల చట్టం మేరకు ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయసేవా సమితి ఛైర్మన్, ఏడీజే శ్రీహరి సూచించారు. పట్టణంలోని కోర్టు హాల్లో శనివారం ఆయన న్యాయసేవాసమితి ఆధ్వర్యంలో న్యాయవాదులు, పోలీసులతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అలాగే లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ కూడా తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. వీటిపై పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మనోహర్‌బాబు, ఫక్రుబాషా, గంగాధర్‌కుమార్, శ్రీనివాసులు, సోమశేఖర్, రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చెస్‌టోర్నీ ప్రారంభం

గుంతకల్లుటౌన్, జూలై 20: పట్టణంలోని మాంటిస్సోరి స్కూల్లో శనివారం చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి హాజరై ప్రారంభించారు. టోర్నీ నిర్వాహకుడు నాగార్జున మాట్లాడుతూ ఫిడె వరల్డ్ చెస్ ఫెడరేషన్, ప్రపంచ చదరంగ సమాఖ్య ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా 50దేశాల్లో 640 చెస్ టోర్నమెంట్లు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా ఇక్కడ ఈ టోర్నీని నిర్వహించామన్నారు. టోర్నీలో మొదటి స్థానంలో శిరీష, రెండో స్థానంలో సుకృత, మూడోస్థానంలో హారిక విజయం సాధించారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, జనసేన జిల్లా కార్యదర్శి వాసిగిరి మణికంఠ పాల్గొన్నారు.

అశ్రునయనాలతో లక్ష్మన్న అంత్యక్రియలు

కుందుర్పి, జూలై 20: ఉపాధ్యాయ సంఘం నాయకుడు, కమ్యూనిస్టు యోధుడు లక్ష్మన్న అంత్యక్రియలు శనివారం మండల కేంద్రంలో అశ్రునయనాల మధ్య జరిగాయి. 93 ఏళ్ల లక్ష్మన్న అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన భార్య, పిల్లలు, బంధువులు సానుభూతిపరులు, కమ్యూనిస్టు శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. గ్రామ శివారులోని గ్యాస్ గోడౌన్ వద్ద అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవప్ప, మహిళా సమాఖ్య నాయకురాలు అమీనమ్మ, ఎస్టీయూ నాయకుడు దస్తగిరి, సీపీఐ నాయకులు శివరుద్ర రామకృష్ణ, కరెన్న, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొని అంజలి ఘటించారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

పామిడి, జూలై 20: పట్టణంలోని పెన్నానదిలో గల సత్యసాయిబాబా పంప్ హౌస్‌లను, పైపులైన్ పనులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుత్తి పట్టణంలో ప్రజలకు తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే దాదాపు 60 శాతం తాగునీటి సమస్యను తీర్చామన్నారు. పైపులైన్ ఏర్పాటు, 24 గంటల విద్యుత్ సరఫరా సౌకర్యం పూర్తయితే గుత్తి పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యసాయిబాబా వాటర్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● అధికారులకు ఎంపీడీఓ, తహసీల్దార్ల సూచన

డీ.హీరేహాళ్, జూలై 20: రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తోందని, దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బాల ఈశ్వరరెడ్డి, ఎంపీడీఓ రఘునాథ్ సూచించారు. మండలకేంద్రంలో శనివారం వారు అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజల్ని అప్రమత్తం చేయాలని , అలాగే అక్కడ జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామ పరిసర ప్రాంతాలు, పాఠశాలల సమీపాల్లో నీటి గుంటలు ఉన్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. శిథిలావస్థ పాఠశాలలు, ఇళ్లల్లో ఉండే వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాల్లోకి చేర్చాలని సూచించారు. వర్షం ప్రభావంతో ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూసేలా విద్యుత్ అధికారులు అప్రమత్తం గా ఉండాలన్నారు. పంటనష్ట వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సంబంధితాధికారులకు తెలిపారు. వైద్యసిబ్బంది అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ బసవకుమార్, ఏఈ హరికృష్ణనాయక్, ఏఓ బలరాం, ప్రభుత్వ వైద్యులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

యల్లనూరు: తుఫాను కారణంగా అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిన కారణంగా పంచాయతీ సెక్రెటరీలు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వీర్రాజు తెలిపారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన పంచాయతీ సెక్రెటరీలతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు.



బెళుగుప్పలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బరాజు

బెళుగుప్ప: తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సుబ్బరాజు, తహసీల్దార్ హరినాథరావు సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వారు సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. వ్యవసాయాధికారి పృథ్వీసాగర్, సుధాకర్, ఈవోఆర్డీ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

● ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు టీడీపీ సర్పంచ్‌ల వినతి



మంత్రి కేశవ్‌ను సన్మానిస్తున్న సర్పంచ్‌లు

విడపనకల్లు, జూలై 20: మండలంలోని పలు గ్రామాల్లో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కరించాలని టీడీపీ మద్దతు సర్పంచ్‌లు రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్‌కు విన్నవించారు. విజయవాడలోని సచివాలయంలో శుక్రవారం వారు మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. పలువురు మాట్లాడుతూ విడపనకల్లులోని ఎస్ఎస్ ట్యాంక్ నీరు లేక పూర్తిగా ఎండిపోయిందన్నారు. దీంతో 19 గ్రామాల ప్రజలు తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బొల్లనగుడ్డం నుంచి వచ్చే నీరు కూడా 20 రోజులుగా రావడం లేదన్నారు. దీంతో గ్రామాల్లో తాగు నీటి కష్టాలు తీవ్రమయ్యాయని తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే అనంతపురం కలెక్టర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి విడపనకల్లు మండలంలో తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు. తొలుత మంత్రిని పూలమాలలు, శాలువాలుతోను సన్మానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విడపనకల్లు, వీ కొత్తకోట, వేల్పుమడుగు, మాళాపురం, జనార్ధనపల్లి, సర్పంచ్‌లు చంద్రశేఖర్, తిమ్మరాజు, తిప్పారెడ్డి, జనార్దననాయుడు, నాయకులు వన్నూరుస్వామి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

● సిబ్బందికి డీఎంహెచ్ఓ ఈబీ దేవి సూచన



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

పామిడి, జూలై 20 : ప్రస్తుతం వ్యాప్తిచెందే సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, వాటిపై పట్టణ, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ భ్రమరాంబికాదేవి వైద్యులు, వైద్య సిబ్బందికి సూచించారు. పట్టణంలోని పలు కాలనీలలో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా నిల్వ ఉన్న నీటిలో గంబుషియా చేపలు వదిలారు. అనంతరం సీహెచ్‌సీలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో సమావేశమై మాట్లాడారు. అతిసారాపై అలసత్వం వహించవద్దన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలన్నారు. ఆయా వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని సూచించాలని చెప్పారు. కార్యక్రమంలో లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ, సీహెచ్‌సీ వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

విడపనకలు/యాడికి: విడపనకల్లు ఎంపీడీఓ కార్యాలయంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాజేంద్ర వివిధ గ్రామాల అధికారులు, వైద్య సిబ్బందితో సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ముఖ్యంగా దోమలను నివారించడం, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల వ్యాధులు దరి చేరవని చెప్పారు. ఇదిలా ఉండగా.. మండలంలోని విడపనకల్లు, పాల్తూరు పీహెచ్‌సీల, అంగన్‌వాడీల సిబ్బంది సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. విడపనకల్లులో పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ చేపట్టారు. అక్కడ మానవ హారంగా ఏర్పడి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మలేరియా యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే యాడికి మండలం చందన హైస్కూల్‌లో విద్యార్థులకు మలేరియా నివారణ తాడిపత్రి సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు.

బసవేశ్వరుడి ధర్మాన్ని పాటిద్దాం

ఉరవకొండ,జూలై 20: బసవేశ్వరుని ధర్మాన్ని పాటిద్దామని గవి మఠం ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని గవిమఠం ఆవరణలో శనివారం ఆయన వీరశైవ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో వీరశైవసభ్య నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులమత భేదాలు ఉండకూడదనేది బసవేశ్వరుడి అభిమతమన్నారు. సేవాదృక్పథంతో అందరూ ముందుకు వెళ్లాలని కోరుకున్నారన్నారు. అందరూ ఆయన ధర్మాన్ని పాటిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు నిరంజన్‌గౌడ్, మల్లికార్జున, గంగాధర్, జయరాంరెడ్డి, శంకర్‌గౌడ్, చంద్రమౌళి, దేశాయ్‌వీరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోండి

పెద్దవడుగూరు, జూలై 20: గ్రామాల్లో సీజనల్‌వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి సంబంధితాధికారులను కోరారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు అధికంగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. కనుక వ్యాప్తి చెందకుండా వైద్యులు, సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే తాగు నీరు, మౌలిక సదుపాయలపై ఆయా అధికారులు దృష్టిసారించాలని కోరారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. తహసీల్దార్ శేషారాంసింగ్, ఏపీఓ పుల్లారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేతో రైతులకు తీవ్ర అన్యాయం

● రెవెన్యూ అధికారులపై ఎంపీపీ, సర్పంచు ఆగ్రహం

పామిడి, జూలై 20 : వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ రీసర్వేతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, రామరాజుపల్లి గ్రామ సర్పంచు ముత్యాలరెడ్డి మండిపడ్డారు. మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందుకు ఎంపీడీఓ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు లావనూరు శోభారాణి, సీఐ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి హాజరయ్యారు. రెవెన్యూ శాఖ సమాచారాన్ని డిప్యూటీ తహసీల్దార్ తెలియజేస్తున్న సమయంలో ఎంపీపీ, సర్పంచు రీ సర్వేపై అసహనం వ్యక్తంచేశారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా రామరాజుపల్లిని ఎంపిక చేసి రీ సర్వే చేశారన్నారు. ఈ రీ సర్వేతో రైతులకు మరిన్ని భూ వివాదాలు తలెత్తాయన్నారు. ఈ వివాదాలపై ఎన్నోసార్లు కలెక్టర్ స్థాయి వరకూ వివరించినా ఫలితం శూన్యమని మండిపడ్డారు. రీ సర్వే వల్ల రైతులకు అన్యాయమే జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖకు చెందిన రీ సర్వే, ల్యాండ్ టైటిల్ యాక్టులపై వైసీపీ ప్రభుత్వానికి రెవెన్యూ అధికారులు సరైన సమాచారం చేరవేయలేదని, అందువల్లే ఆ ప్రభుత్వం కూలిపోయిందని పేర్కొన్నారు. దీంతో డిప్యూటీ తహసీల్దార్ చేసేదేమీ లేక మిన్నకుండిపోవడం గమనార్హం. మిగిలిన శాఖాధికారులు తమ శాఖల సమాచారాన్ని వివరించారు. వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు

కళ్యాణదుర్గం రూరల్, జూలై 20: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశామని, ఇందులో నిరుద్యోగులకు పలు అంశాలపై ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్వై శ్రీధర్ కుమార్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్ రాజ్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులకు రెండు నుంచి మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కళ్యాణదుర్గం చుట్టుపక్కల ఉన్న గ్రామాల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సోమవారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9440661900, 9701862179లకు సంప్రదించాలని సూచించారు.

మేళ్లకుంటలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కళ్యాణదుర్గం, జూలై 20: ట్రాన్స్‌పార్మర్లను ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్‌ను ఎత్తుకెళ్తున్న దుండగుల ఆగడాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. తాజాగా శనివారం తెల్లవారుజామున కంబదూరు మండలం మేళ్లకుంట రహదారిలో గల మల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్‌ను అపహరించారు. ప్రధాన రహదారి పక్కనే ఈ ట్రాన్స్‌పార్మర్ ఉన్నప్పటికీ దొంగలు దర్జాగా ధ్వంసం చేసి కాపర్‌ను చోరీ చేశారు. ఈ మధ్య కాలంలో కంబదూరు మండలంలో ఇటువంటి చోరీలు అధికమవుతున్నాయి. దీంతో రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి ఈ దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.